దేవుని ఆశీర్వాదం మాత్రం ఉంటుందన్నది నా నమ్మకం. ఆయనే లేకపోతే ఇంత మంది ఉద్దండులను తట్టుకుని యువకుల మైన మేము అధికారంలోకి రావటం సాధ్యమయ్యే పనేనా? "

"అయితే ఎదుటివారిలో మార్పు తెమ్మని ఆ దేవుడ్నే ప్రార్థించండి"

"దేవుడు దేనినీ మార్చడు. మనం పూను కుంటే సహాయం చేస్తాడంతే"

"ఆ ప్రయత్నం చేయటం కంటే దేవుడ్నే నీ సహాయానికి తీసుకురావటం తేలికేమో" చర్చ ముగించి లేచాడు ప్రభు.

మహేష్ జీవితంలో అబ్బురపరచే మార్పులు అతి త్వరలో జరగబోతున్నా యని అప్పుడు వారిరువురికీ తెలియదు.




"**సా**రీ! ఈ ప్రాజెక్టు నేను చెయ్యలేను" అన్నాడు ఆదిత్య. అతను తెలుగు సినిమా లలో లీడింగ్ హీరో! ప్రస్తుతం సినిమా పరిశ్రమని ఏలుతున్న నటుల్లో ఒకడు. చేసిన సినిమాలన్నీ హిట్ అయిన అత్యంత అరుదైన హీరో!

"అదేంటి సర్! కథ బాగాలేదా? " అప్ప టిదాకా కథ చెప్పిన దర్శకుడు నిరుత్సా హంగా అడిగాడు.

"కథ బానే ఉంది. కాకపోతే నాకు నప్పదు. వేరే వారిని పెట్టి తియ్యండి"

"మీరు నటిస్తే చాలా గొప్ప సినిమా అవుతుంది సర్!" చావని ఆశతో అన్నాడు ఆ దర్శకుడు.

"నాకు తెలుసు. కానీ నా అభిమానులు నన్ను ఒక బిచ్చగాడి పాత్రలో చూడలే రండీ. ట్రెండును కూడా చూసుకోవాలి కదా!"

"కానీ, మీకు ఈ సినిమా ఎన్నో అవా ర్డులు తెచ్చి పెడుతుంది.. నేషనల్ అవార్డు రాదగ్గ కథ, పాత్ర"

వారిద్దరు ఆదిత్య ఆఫీసులో కూర్చుని కథాచర్చ చేసుకుంటున్నారు. ఎన్నో రోజుల ఎదురుచూపుల తరువాత ఆ దర్శ కుడికి ఈ అవకాశం లభించింది. అది ఇలా వృథా పోవటం అతనికి నిరుత్సా హంగా ఉంది.

ఇక ఆ సంభాషణ అంతటితో ఆపాలని నిర్ణయించుకున్న ఆదిత్య అనునయంగా చెప్పాడు. "చూడండి! నేను అభిమానుల కోసం నటిస్తాను. అవార్డుల కోసం కాదు. అందరికీ నచ్చే కథతో రండి. మళ్ళీ వింటాను. ఇది మిమ్మల్ని అవమానిం చటం కాదు. మీ కథని అవమానించటం అంతకంటే కాదు. నాకు ఇంతవరకు ఫ్లాప్ లేదు. ఆ ప్రత్యేకత కేవలం నేను సెలెక్ట్ చేసుకుంటున్న కథలవల్లే! దయచేసి నన్ను ఇబ్బంది పెట్టకండి"

నిట్టూర్చాడు ఆ దర్శకుడు.

"సరే సర్! మళ్ళీ ఇంకో కథతో వస్తాను. ప్రస్తుతానికి సెలవ్!" అంటూ లేచాడు.

"అలాగే! మీతో పనిచెయ్యటం నాకు ఎప్పుడూ ఇష్టమే! నాకు నప్పే కథతో రండి"

దర్శకుడు బయటకు వెళ్ళిపోయాడు.

అప్పటివరకు ఆదిత్యతోపాటు ఆసక్తిగా కథ వింటున్నాడు ఆఫీసు అటెండర్.

"ఏమోయ్! అతను చెప్పిన కథ ఎలా ఉంది? " అడిగాడు ఆదిత్య.

"ఛండాలంగా ఉంది సర్! మీకు సూట్

కాదు"

తృప్తిగా తల ఊపాడు ఆదిత్య. అదే అతను సినిమా ఒప్పుకుని ఇదే మాట అడిగి ఉంటే ఈ ప్రశ్నకు జవాబు- 'బ్రహ్మాండమైన హిట్ అవుతుంది' అని వ చ్చేదని ఆదిత్యకు తెలియదు.

ఒకప్పుడు ఆదిత్య కూడా సినిమా రంగంలోకి ప్రవేశించటానికి అనేక తంటాలు పడినవాడే! ఇబ్బందులను ఎ దుర్కొన్నవాడే!! అయితే ఒకసారి సినిమా పరిశ్రమలోకి ప్రవేశించాక అతని అదృష్టం కొద్దీ పెద్దగా కష్టపడనవసరం లేకుండానే అభివృద్ధిలోకి వచ్చాడు. హిట్ సినిమాలు ఇచ్చే హీరోకంటే ఇండస్ట్రీకి కావలసింది ఏముంటుంది? ఒక పెద్ద నిర్మాత తన కూతుర్ని ఇచ్చి పెళ్లి చేశాడు. అదృష్టం కూడా అతనికి తోడయింది. నటించిన సినిమాలన్నీ హిట్లయ్యాయి. నెమ్మదిగా చుట్టూ వందిమాగధులు చేరారు. సిని మాలు హిట్లయ్యే కొద్దీ కోటరీ సంఖ్య పెర గసాగింది. వారంతా కలిసి బయటి ప్రపం చంతో సంబంధం లేకుండా ఒక ఇనుప చట్రం అతని చుట్టూ బిగించారు. అతను ఆనందంగా అందులో ఇరుక్కుపోయాడు. ప్రస్తుతం అతను ఆ చట్రానికి అలవాటుప డిపోయి అదే లోకం అనుకుంటున్నాడు. అతని సినిమాలు వరుసబెట్టి సక్సెస్ అవు తుండటంతో ఆ చట్రం ఇంకా పటిష్టం అవుతూ వస్తోంది.

ఒకసారి అతని సినిమాలు ఫ్లాప్ అవటం మొదలుపెడితే ఆటోమేటిగ్గా ఆ చట్రం సడలిపోతుంది. అతని చుట్టూ చేరిన వారు నెమ్మదిగా వెనుకంజ వేస్తారు. సినిమా పరిశ్రమకి ఎప్పుడూ ఒక సూపర్‌స్టార్ కావాలి. ఒకరు వెను కంజ వేయగానే మరొక సూపర్ స్టార్‌ని ఇండస్ట్రీ తయారు చేస్తుంది.

అయితే ప్రస్తుతానికి సినిమా ఇండస్ట్రీలో ఆదిత్యకు ఎదురులేదు.

యక్షప్రశ్నలకు జవాబు చెప్పే సంద ర్భంలో యక్షుడు ధర్మరాజుని ఒక ప్రశ్న అడుగుతాడు 'ఈ సృష్టిలో అన్నిటికంటే విచిత్రమయినది ఏమిటి? ' అని.

దానికి ధర్మరాజు ఇలా చెప్తాడు "మన కళ్ళ ముందు రోజూ అనేకమంది మరణి స్తుంటారు. ఆ మరణాలను చూస్తూ కూడా మానవుడు ఈ మృత్యువుకు తను అతీతుడన్నట్లు ప్రవర్తించటం కంటే విచిత్రం ఇంకేముంటుంది? "

అలాగే ఎందరో మహానటులు పుట్టారు. అందులో కొంతమంది స్టార్‌ల య్యారు. స్టార్‌లైనవారెవరూ ఆ స్థానంలో శాశ్వతంగా ఉండరు. కొంతకాలానికి స్టార్ డమ్ పోగొట్టుకున్నారు. కానీ స్టార్‌గా ఉన్నంత కాలం ఆ స్టార్‌డమ్ ఏదో ఒక రోజు పోవచ్చన్న ఆలోచనే వారికి రాదు.

అదే సినిమా పరిశ్రమలోని వైచిత్రి.

ఇంతలో ఆదిత్య ఫోన్ మోగింది. ఎత్తే ముందు ఎవరా అని చూశాడు. అతని భార్య సుమ ఆ ఫోన్ చేస్తోంది.

"హాయ్ సుమా! ఎక్కడున్నావ్? " అన్నాడు ఆదిత్య ఫోన్ ఎత్తి.

"నేను గుడికి వచ్చాను. కారు చెడి పోయింది. ఇక్కడ ఇరుక్కుపోయాను. మీరెక్కడ ఉన్నారు? కారు పంపగలరా? " అడిగింది సుమ.

"దగ్గర్లోనే ఉన్నాను. కారు పంపటం ఎందుకు? నేనే వచ్చి పికప్ చేసుకుం టాను. అప్పటివరకు అక్కడే ఉండు" అని డ్రైవర్‌కి తాను వెళ్ళవలసిన గుడిపేరు చెప్పాడు.

కారు అటు తిరిగింది.

మరో పావుగంటలో కారు గుడి ముందు ఆగింది. "నేను బయటకు వస్తే జనాలు మీద పడతారు. తాకిడి తట్టు కోలేం! నువ్వెళ్ళి అమ్మగారిని తీసుకురా!"

అని డ్రైవర్ని గుడిలోకి పంపాడు.

ఆ గుడి ఒక చిన్నగుట్ట మీద ఉంది. డ్రైవర్ వెళ్ళి ఆమెని తీసుకురావటానికి కాస్త సమయం పడుతుంది. ఈ లోపు ఏమి చేయాలో అర్థంకాక ఏసీ కారులో విశ్రాంతిగా వెనక్కి వాలాడు అతను. స్పీకర్లో నుండి తన కొత్త సినిమా పాటలు వినిపిస్తున్నాయి.

ఇంతలో అతని దృష్టి గుడికి వెళ్ళే దారి మీద పడింది.

గుట్ట మీదికి వెళ్ళటానికి మెట్లున్నాయి. మెట్లకి అటు ఇటు కూర్చుని గుడి లోపలకు వెళ్ళే వారిని అడుక్కుంటున్నారు కొందరు బిచ్చగాళ్ళు.

ముఖ్యంగా ఆఖరి మెట్టుమీద కూర్చుని ఉన్నాడు ఒక వ్యక్తి. అతని జుట్టు జడలు కట్టి ఉంది. గడ్డం గుబురుగా పెరిగి ఉంది. ఆ గడ్డం నల్లగా ఉండబట్టి అతని వయసు ఎక్కువ ఉండదనుకోవాలి తప్ప అతని మొహంలో గడ్డం తప్ప ఇంకేమీ కనపడటంలేదు. అతని ఒంటి మీద ఉన్న దుస్తులు మురికిపట్టి పీలికలయి ఉన్నాయి. మామూలుగా అయితే అతన్ని ఒకసారి చూడగానే ఎవరైనా మొహం పక్కకి తిప్పుకుంటారు.

మధ్యమధ్యలో ఖళ్ళుఖళ్ళున దగ్గుతున్న అతన్ని చూస్తుంటే ఎవరికైనా అతని దగ్గరకు వెళ్ళాలంటే భయం గొలుపుతుంది. కానీ ఈ బిచ్చగాడు ఎందుకో అతన్ని ఆకర్షిస్తున్నాడు.

కాసేపటి క్రితం తను విన్న కథలో పాత్ర బిచ్చగాడు కావటం వలన కాబోలు అతనంటే ఏదో తెలియని కుతూహలం కలుగుతోంది. అతన్ని చూస్తున్న కొద్దీ





ఆదిత్యకి ఏవగింపు కలగటానికి బదులు జాలి ఎక్కువైంది. 'ఏ పరిస్థితుల ప్రభావాన అతను అలా తయారయ్యాడో' అని కుతూహలం కలిగినా, దానిని కనుక్కునే వీలు తనకు కుదరదని అతనికి తెలుసు.

ఒకసారి తనను ఆ పాత్రలో ఊహించుకున్నాడు ఆదిత్య. అంతే! అతని శరీరం జలదరించినట్లయింది. సినిమాలో అయినా సరే, తననుతాను ఆ ఆకారంలో ఊహించుకోలేకపోయాడు. ఇక తను అలా చేస్తే తన అభిమానులు ఏమైపోతారో అనుకున్న అతను ఆ కథను రిజెక్ట్ చేయటమనే తన నిర్ణయాన్ని మరొకసారి మనసులో సమర్థించుకున్నాడు.

ఇంతలో అతనికి ఇంకో ఆలోచన వచ్చింది. ఆ బిచ్చగాడిని ప్రస్తుత పరిస్థితుల నుండి బయట పడేసి ఆనందంగా జీవించేలా చేయవచ్చా? ఒకవేళ అలా చేయాలంటే అతనికి ఎంత డబ్బు ఇవ్వాలి? పదివేలు చాలా? లక్ష అయితే ఎక్కువవుతుందా? చిన్న కిళ్ళీ కొట్టు పెట్టుకుని గౌరవంగా బతకటానికి లక్ష చాలదూ? సరిపోదేమో! అతని ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉన్నట్టు ఉంది... అని ఆదిత్య రకరకాల ఆలోచనలు చేశాడు.

అతను ఏ మాత్రం తెలివికలవాడయినా, ఆరోగ్యం సహకరిస్తే ఒక లక్ష రూపాయలతో అతని జీవితం బాగు చేయవచ్చని అనుకున్నాడతను చివరికి. కానీ అతనికి ఆ లక్ష ఎవరిస్తారు? పోనీ, తనే ఇస్తేనో! వెంటనే అతని అంతరాత్మ అతన్ని మొట్టికాయ వేసింది. 'నువ్వు మామూలు మనిషివి. ఎదుటి వారి జీవితాలు మార్చలేవు. అది దేవుడి పని. ఆ శక్తి ఉన్న ఆయన ఎవరినీ పట్టించుకోకుండా ఉంటే మధ్యలో నీకేమి సంబంధం? అంతగా జాలి వేస్తే పది రూపాయలు ఇవ్వు. అంతకంటే ఆ బిచ్చగాడు కూడా నీ నుండి ఏమీ ఆశించడు' అని తేల్చింది.

ఇంతలో అతని భార్య సుమ వచ్చి కారు ఎక్కింది. "ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? " అంది, ఏదో ఆలోచనలలో మునిగిపోయినట్లు ఉన్న భర్తను చూసి.

కారు అక్కడి నుండి బయలుదేరింది.

"ఏమీలేదు" అన్నాడు ఆదిత్య. ఇంతలో ఏదో గుర్తుకు వచ్చినట్లు "నువ్వేంటి ఇవాళ